# స్నేహబంధం

ఉదయంపూట పూజ అయ్యేక ఇంట్లో నుంచి బయటకు వొచ్చాడు మంగారావు.

ఇంటిముందు అరుగుమీద కూర్చున్నాడు రోడ్డుమీద వొచ్చేపోయేవారిని చూస్తూ. స్కూలుకువెళ్ళే పిల్లలు రోడ్డుమీద చేరి స్కూలు బస్సుకోసం ఎదురుచూస్తూ వున్నారు. స్కూటరుమీద పాలకేన్ పెట్టుకుని ఇంటింటికి తిరిగి పాలుపోస్తున్నాడు పాలవాడు. అదే సమయంలో చెత్త తీసుకువెళ్ళే రిక్షావాడూ వొచ్చి అరుస్తున్నాడు.

హిమబిందు ఇంట్లోనుంచి బయటకు వొచ్చి పాలు పోయించుకుంది.

"అమ్మాయికి పెళ్ళిచెయ్యాలి ఈ మాఘమాసంలో" అనుకున్నాడు మంగారావు.

చేత్తో తలనిమురుకున్నాడు. మూడొంతులు బట్టతల వొచ్చేసింది.

రోడ్డుప్రక్కన వున్న బాదంచెట్టువైపు చూశాడు. ఎండిపోయిన ఆకులన్నీ రాలిపోయి గుట్టగా పడివున్నాయి. రోజూ ఆ చెట్టువైపు చూస్తూనే వున్నాడు. ఆకులు పచ్చబడిపోవడం గమనించనే లేదు.

జీవితం గుట్టు తెలిసిపోయింది.

పాలగిన్నెతో లోపలికివెళ్తున్న కూతురువైపు చూసి "సాంబమూర్తి వొచ్చేవేళ అయ్యింది... రెండు గ్లాసులు కాఫీ పంపు... అరుగుమీదే కూర్చుంటాం" అన్నాడు.

హిమబిందు తలూపి లోపలికి వెళ్ళిపోయింది.

సాంబమూర్తి, తనూ ఒకే వీధిబడిలో చదువుకున్నారు. హైస్కూలు, కాలేజీలో కూడా అతను తన క్లాస్‌మేటే! గమ్మత్తుగా ఇద్దరికీ ఒకే ఆఫీసులో ఉద్యోగాలు వొచ్చేయి.

ఊళ్ళో సాంబమూర్తి మోతుబరి రైతు కొడుకు. తను రైతుకూలీ కొడుకు. అతని కొడుకు అమెరికాలో స్థిరపడ్డాడు... అందుకే అతను తను వో మెట్టుపైన వున్నానని

తలపోస్తూ వుంటాడు. కొడుకు గొప్పతనం గూర్చి, అమెరికా అంద చందాల గూర్చి కథలు, కథలుగా చెబుతూ వుంటాడు.

ఇద్దరూ పదవీవిరమణ చేశారు. రోజూ అరుగుమీద చేరి కబుర్లు చెప్పు కోవడం, బాగా ఎండ వొచ్చినప్పుడు ఇంట్లో చేరి చదరంగం, పరమపదసోపాన పటం ముందేసుకుని గంటలు నిముషాల్లా గడిపివెయ్యడం అలవాటయ్యింది.

ఏదొక విషయంమీద చర్చ మొదలుపెడతాడు. తన వాదనే కరెక్ట్ అంటాడు. అతని వాదనలు విని నవ్వుకోవడం తనవంతు.

సాంబమూర్తి వొచ్చాడు.

"మనవాళ్ళు ఉత్త వెధవలోయ్.. అమెరికావాడు అంగారక గ్రహంపైన వ్యోమనౌకకు దింపి పరిశోధనలు చేస్తుంటే మనవాళ్ళు అవినీతిమార్గంలో సొమ్ము కోట్లాది రూపాయలు వెనకేసుకోవడంలో ఆరితేరారు" అన్నాడు సాంబమూర్తి మంగారావు పక్కన కూర్చుంటూ.

సాంబమూర్తి కొడుకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తు న్నాడు. పదేళ్ళు అయ్యింది ఆ అబ్బాయి అమెరికావెళ్ళి, మధ్యలో ఒక్కసారి కాబోలు ఇండియా వొచ్చాడు. సాంబమూర్తి పదవీ విరమణ చేసేక వొక్కసారి అమెరికా వెళ్ళేడుగాని ముచ్చటగా మూడు నెలలు కూడా అక్కడ వుండలేక పోయాడు. ఎప్పుడూ అమెరికాలో పుట్టి పెరిగినట్లు మాట్లాడుతాడు. ఇండియా అంటే చిన్నచూపు. ఇంట్లో కంప్యూటర్ వుంది. ఫేస్‌బుక్‌లో మెంబరు. తనకు దేశీయులు, విదేశీయులు వందమంది స్నేహితులున్నారని గొప్పగా చెప్పుకుంటూ వుంటాడు. తీరిక దొరికినప్పుడల్లా నెట్‌లో దూరిపోయి కాలక్షేపం చేస్తూ వుంటాడు. మాటల్లో నాలుగు ఇంగ్లీషు పదాలు దొర్లించి వేస్తూ వుంటాడు. ఫేస్‌బుక్‌లో ఎవడి ఘనత గూర్చి వాడు గొప్పగా డబ్బా కొట్టుకుంటూ వుంటారు.

అవేవి మంగారావుకు నచ్చవు. పొలాల్లో తిరగడం ఇష్టం. పుస్తకాలు చదువుతూ చక్కటి సంగీతం వింటూ జీవిత చరమాంకం ఆనందంగా గడిపేయా లనుకుంటాడు.

మిత్రుడి మాటలు నచ్చలేదు మంగారావుకి.

"మనవాళ్ళ అవినీతి విషయంలో రెండో అభిప్రాయం లేదుగాని అమెరికావాడు అన్నిటిలో గొప్ప అంటే నేను ఒప్పుకోను... క్యూరియాసిటి రోవర్‌ను అరుణగ్రహంపైన దింపడంలో భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త కూడా కీలకపాత్ర పోషించాడన్న విషయం మర్చిపోవొద్దు... నువ్వేదో 'అమెరికా... అమెరికా' అంటూ ఎగిరిగంతులేస్తావుగాని

అమెరికా పురుడు పోసుకోకముందే మన దేశంలో గొప్పగొప్ప గణితశాస్త్రవేత్తలు ఉద్భవించారు... ఆర్యభట్టు, వరాహమిహిరుడు బ్రహ్మగుప్తుడు, భాస్కరుడు- వీళ్ళంతా మనవాళ్ళే! పదకొండవ శతాబ్దం నాటికే వైద్యనిపుణుడు చరకుడు, శస్త్రచికిత్సలో శుశ్రుతుడు పేరెన్నికగన్నారు.... ఇతర గ్రహాల వివరాలు మన పంచ సిద్ధాంతాల్లోనే వున్నాయి... వరాహమిహిరుడు ఏన్నో గ్రహాంతర విషయాలు చెప్పాడు..." చెప్పుకుపోయాడు మంగారావు.

"అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పడం కాదు అమెరికా వెళ్ళి ఒక్కసారి చూడు... అక్కడ ఎంత అభివృద్ధి వుందో మన దగ్గర ఎంత అవినీతి పేరుకు పోయిందో తెలుస్తుంది.. ఇక్కడ ఆఫీసులో కాగితం కదలాలంటే చేతులు తడపాలి! అమెరికాలో ఎవరి పని వాళ్ళు క్రమపద్ధతిలో చేసుకుపోతారు" అన్నాడు సాంబమూర్తి.

"అమెరికా అంత గొప్పగా వుంటే అక్కడ ఆరునెలలు వుంటానని చెప్పి మూడు నెలలు కూడా వుండలేకపోయావేం?" దెప్పిపొడిచాడు మంగారావు.

ఆలోచనలలో మునిగిపోయాడు సాంబమూర్తి.

.... అన్ని సౌకర్యాలు వుంటాయిగాని బంగారు పంజరంలో వున్నట్లు వుంటుంది అక్కడ... కొడుకు కోడలు ఉదయం ఆఫీసుకు వెళ్ళి రాత్రికి ఇంటికి తిరిగివస్తారు.... రోజూ వంటచేసుకోరు... వారం రోజుల కిందట వండిన కూర వడ్డించబోతుంది కోడలు... తనకేమో వేడివేడిగా వుండాలి వంటకాలు.. కార్లు తప్పితే జనం కన్పించరు.. ఇరుగు పొరుగువారు ఎవరూ మాట్లాడరు... డౌన్‌టౌన్ దగ్గర, షాపింగ్ మాల్స్ దగ్గరే జనసందోహం కన్పించేది... అక్కడి జీవనశైలి ప్రత్యేకంగా వుంటుంది.... ఆ చట్రంలో తను ఇమడలేక ఇండియా తిరిగి వచ్చేశాడు.

మంగారావు కూతురు హిమబిందు కాఫీగ్లాసులు తెచ్చి అరుగుమీద కూర్చున్న ఇద్దరికి ఇచ్చింది.

కాఫీ తాగేక "అమెరికానుంచి మా అబ్బాయి ఫోన్ చేసే సమయం అయ్యింది... ల్యాండ్‌లైన్‌కే చేస్తాడు.... మనకు పగలయితే వాళ్ళకు రాత్రిపూట.... పడుకోబోయే ముందు ఫోన్ చేస్తాడు.... అక్కడ నుంచి ఫోన్‌వస్తే ఐదునిముషాలు కాదు, గంటసేపు మాట్లాడాలి.....అప్పుడుగాని మావాడికి తృప్తి వుండదు" అనేసి వెళ్ళిపోయాడు సాంబమూర్తి.

మిత్రుడివైపు చూసి నిట్టూర్పు విడిచాడు.

సాంబమూర్తి చెప్పేది అబద్ధం అని తెలుసు మంగారావుకి. అతని కొడుకు

రెండుమూడునెలల కొకసారి ఫోన్ చేస్తారు.... అదీ మూడు ముక్కలు మాట్లాడి మాటలు ముగిస్తాడు. తండ్రిమీద కోపం వుంది కొడుక్కి తనకు చెప్పకుండా రెండెకరాల పొలం కూతురికి రాసి ఇచ్చాడని కొడుక్కి కోపం... సాంబమూర్తి కూతురు ఆర్థిక ఇబ్బందుల్లో వుంది.... తండ్రి ఆదుకుంటూ వుంటాడు... అది నచ్చదు అతని కొడుకుకు.

ఆర్థిక కారణాలమూలంగా వో కన్నతల్లి బిడ్డలయినా అన్న, చెల్లెలు మధ్య అగాధం ఏర్పడింది. అన్ని రకాల సహాయంచేసినా ఆ కూతురికి తండ్రిపట్ల సఖ్యతలేదు "అన్నయ్య అమెరికాలో బోలెడుసంపాదించుకున్నాడు. మిగిలిన పదెకరాలు నా పిల్లలపేరుమీద రాసెయ్యి నాన్నా!" అంటూ సాంబమూర్తిని సతా యిస్తుంది. అల్లుడికి అన్ని వ్యసనాలున్నాయి... పైసా సంపాదించడు కష్టపడి....

ఆస్తిపాస్తులున్నా సాంబమూర్తికి సుఖంలేకుండా పోయింది.

పోస్ట్‌మాన్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు మంగారావు.

గ్రామంలో వున్న తమ్ముడు ఉత్తరాలు రాస్తూ వుంటాడు.

ఆ ఉత్తరాల్లో మట్టిపరిమళం వుంటుంది.

"అందరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుంటే నువ్వేమిటి నాన్నా 'పోస్ట్' అన్న కేకకోసం ఎదురుచూస్తూ వుంటావ్. పోస్ట్‌మాన్ నీకు ఉత్తరం ఇస్తే చిరకాల మిత్రుడిని కలుసుకున్నంత సంబరంగా వుంటుంది నీకు" అంది హిమబిందు పోస్ట్‌మాన్ రాకకోసం ఎదురుచూస్తున్న తండ్రితో.

"సెల్‌ఫోన్‌లో మాట్లాడితే బాబాయ్‌తో ఆత్మీయంగా మాట్లాడినట్లు వుండదమ్మా! వాడు ఉత్తరంలో పడిపోతున్న పడమటివైపు ప్రహరీగోడ గుర్చి, పాడి ఆవు గుర్చి, పంటచేల గుర్చి, శివాలయం గుడిగోపురంమీద వాలిన పావురాలను గుర్చి, పక్షుల కిలకిలా రావాల గుర్చి ఎన్నో విషయాలు అద్భుతంగా రాస్తాడు మీ బాబాయ్.... ఆ అక్షరాలు ఆత్మీయంగా గుండెలోకి దూసుకుపోయి చెరగని ముద్రవేస్తాయి... ఎలక్ట్రానిక్ సాధనాలతో మానవ సంబంధాలు మాయమైపోతున్నాయి... ఉత్తర ప్రత్యుత్తరాలవల్ల మనిషికి మనిషికి మధ్య గట్టిసాన్నిహిత్యం ఏర్పడుతుంది..." అన్నాడు మంగారావు.

తండ్రి మాటలకు నవ్వుకుంది ఏదో గుర్తుకు వొచ్చి. రోజూ తనతోపాటు పనిచేసే రమేష్ సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పంపుతూ వుంటాడు. ఆ మెసేజ్‌లతో తనలో ఎటువంటి స్పందన వచ్చేది కాదు... కానీ మొన్నీమధ్య రాసిన ప్రేమలేఖ తనలో కోటిరాగాలు

పలికించింది.....తమ ఇద్దరి మధ్య చిగురించిన ప్రేమానురాగాల గూర్చి తండ్రికి సరైన సమయంచూసి చెప్పాలనుకుంది హిమబిందు.... తండ్రి అనుమతిలోనే ఏ బంధమైనా!

❖ ❖ ❖

మంగారావు ఇంట్లో పెళ్ళి హడావుడి మొదలయ్యింది.

బంధువులందరికి శుభలేఖలు పంపుతూ "వారం రోజులు మా ఆతిథ్యం స్వీకరించాలి.... మాతోపాటు వారంరోజులు ఇక్కడ గడపాలి! సిటీ అంతా దగ్గరుండి చూపిస్తాను" అంటూ వ్యక్తిగతంగా ఉత్తరాలు కూడా రాశాడు మంగారావు.

బంధువులంతా వొచ్చారు. వాళ్ళందరూ కలివిడిగా వుండటం చూసి ఆశ్చర్యపోయాడు సాంబమూర్తి.

ఆ వారం రోజులు సాంబమూర్తి మకాం కూడా వాళ్ళింట్లోనే.

సాంబమూర్తి భార్య పదేళ్ళక్రితమే చనిపోయింది. కొడుకు అమెరికాలో... కూతురు విజయవాడలో. ఏడారిలో ఒంటరి ఒంటె బతుకులా వుంది అతని పరిస్థితి. హిమబిందు పెళ్ళికి వొచ్చిన బంధువుల మధ్య వున్న అనురాగబంధాలు చూసి ఆశ్చర్యపోయాడు.

మంగారావు కంటే తను స్థితిపరుడని ఎప్పుడూ గర్వంతో ఊగిపోతూ వుండేవాడు. బ్యాంక్‌లో నలభై లక్షల నిలువ వుంది... తనకు ఏ దిగులూ, చింతాలేదనుకునే వాడు... కానీ తను ఒంటరి.... కొడుకు పట్టించుకోడు.. కూతురికి ఆస్తి పంచిఇవ్వలేదని కోపం... బంధువులెవరూ తన ఇంటివైపు కన్నెత్తి చూడరు.. దానికి కారణం తనే! బంధువుల ఇళ్ళలో జరిగే శుభ, అశుభ కార్యాలకు తను వెళ్ళేవాడు కాదు... తన ఇంటినుంచి బంధువుల ఇళ్లు ఎంత దూరమో వాళ్ళ ఇళ్ళనుంచి తనఇల్లు అంతేదూరం... ఆ విషయం ఇప్పుడు అవగతమైంది.

హిమబిందు, రమేష్ పెళ్ళి సంబరాల్లో తనూ పాలుపంచుకుని గుండెల్లో గూడుకట్టుకున్న కలతలను పక్కకు నెట్టే ప్రయత్నంచేశాడు.

పెళ్ళి అయ్యేక అప్పగింతల సమయంలో మంగారావు కళ్ళలో కదలాడిన కన్నీటిచుక్కలు చూసి చలించిపోయాడు సాంబమూర్తి.

నూతన దంపతులు సాంబమూర్తి పాదాలకు నమస్కరించారు. వారి వినయానికి, సంస్కారానికి పెద్దలంటే గౌరవభావానికి ముగ్ధుడయ్యాడు.

కొడుకుకోడలు గుర్తుకువొచ్చారు.

అమెరికాలో తనతోపాటు పనిచేసే అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిది విశాఖపట్నం. అమెరికానుంచి వాళ్ళిద్దరూ విశాఖపట్నం వొచ్చి తనకు మాట మాత్రం చెప్పకుండా రిజిష్టర్ మ్యారేజ్ చేసుకున్నాడు. పెళ్ళి అయ్యాక హైద్రాబాద్ రాకుండా అమెరికా వెళ్ళిపోయారు.

"మీరు ఆనందంగా వుంటే చాలు... మీ పెళ్ళికి నా అభ్యంతరం ఏమీ లేదు" అని రెండుమూడుసార్లు కొడుకుతో కూడా చెప్పాడు. తనేదో వాళ్ళ పెళ్ళికి అడ్డుపుల్లలు వేసినట్లు కోడలు ఎప్పుడు కన్పించినా తనవైపు గుర్రుగా చూసేది. పెద్దలంటే గౌరవభావం ఏ మాత్రంలేదు.

హిమబిందు అలా కాదు.

రమేష్‌ను ప్రేమించింది – 'పెద్దలు అంగీకారం చెప్పినప్పుడే పెళ్ళి చేసుకుందాం' అని రమేష్‌కు స్పష్టంగా చెప్పింది. తల్లిదండ్రులను ఒప్పించేక పెళ్ళి చేసుకుంది.

నిండు మనస్సుతో హిమబిందును, రమేశ్‌ను ఆశీర్వదించాడు.

❖ ❖ ❖

ఉదయంపూట అరుగుమీద కూర్చుని మంగారావుతో మాట్లాడుతున్నాడు సాంబమూర్తి.

"విదేశీయులు మన వివాహవ్యవస్థను, కుటుంబవ్యవస్థను బాగా పొగుడుతారు... కుటుంబం ప్రకృతి ఇచ్చిన అద్భుతమైన కానుక... కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన సంభాషణలు చోటుచేసుకుంటే, సభ్యుల మధ్య అనుబంధాలు గట్టిపడతాయి... కుటుంబంలోని పెద్దలు పిల్లలకు క్రమశిక్షణ, త్యాగం, ప్రేమ మొదలైన విషయాలను నేర్పాలి...." చెప్పుకుపోయాడు మంగారావు.

టివిల్లో వొచ్చే సీరియల్స్, సినిమాకబుర్లు ఎలా కుటుంబ వాతావరణాన్ని చెడగొడుతున్నాయో అన్న విషయంమీద మాట్లాడేడు చాలాసేపు.

సాంబమూర్తికి ఛాతీలో నొప్పి మొదలైంది.

చల్లటిగాలి వీస్తున్నా అతనికి చెమటలు పట్టడం, శ్వాస పీల్చడంలో ఇబ్బందిపడటం గమనించాడు మంగారావు. వెంటనే అతన్ని ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్ళాడు.

చికిత్స మొదలయ్యింది. సాంబమూర్తి కొంచెం కుదుటబడ్డాక ఛాతీలో పేస్‌మేకర్ అమర్చారు. పదిరోజులు హాస్పిటల్లో ఉండాల్సి వొచ్చింది.

సాంబమూర్తి కొడుకు రవితేజతో మాట్లాడేడు మంగారావు.

"నాకిప్పుడు రావడానికి వీలుపడదు... నాన్న గారి బ్యాంక్ ఎకౌంట్‌లో పెద్దమొత్తంలో డబ్బు వుంది... ఖర్చు పెట్టండి... నేను ఇండియా వొచ్చేక ఖర్చు వివరాలు మాట్లాడుకుందాం" అన్నాడు రవితేజ.

"మా నాన్నగారిని జాగ్రత్తగా చూసుకోండి అంకుల్ నేను వొచ్చేదాకా... వెంటనే బయల్దేరి వొస్తున్నాను.... 'ఎంత డబ్బు ఖర్చు అయినా ఫరవాలేదు... నాన్నగారి ఆరోగ్యం కుదుటపడాలి" అని రవితేజ అంటాడేమో ననుకున్నాడు మంగారావు.

చీదరించుకున్నాడు. తండ్రి విషయం కూతురికి చెప్పినా పట్టించుకోలేదు.

....ఇలాంటి కొడుకు, కూతురూ వుంటే ఏ తండ్రికి ఆనందం కలుగుతుంది?

"మీ అబ్బాయి అమెరికావెళ్ళాడు.... వేలడాలర్లు సంపాదించాడు" అని ఎవరన్నా అంటే ఏ తండ్రి సంతోషపడడు... "మీకు బాగాలేదని తెలిసి వెంటనే పిల్లలు, భార్యను తీసుకుని వొచ్చి మీ ప్రక్కన వాలిపోయారు... మీరంటే వాళ్ళకు ఎంత ప్రేమ!" అని నలుగురూ కొడుకును పొగిడినప్పుడు ఏ తండ్రికైనా ఆనందం కలుగుతుంది.

మంగారావు కూతురు, అల్లుడు- ఇంటిల్లిపాదీ వొచ్చి సాంబమూర్తిని పలుకరించారు. "త్వరలోనే పూర్తిగా కోలుకుంటారు. చకచకా నడుస్తారు" అంటూ భరోసా చెప్పారు.

మంగారావు కుటుంబసభ్యులంతా రోజూ వొచ్చి తనను పలుకరించడం సాంబమూర్తికి ఆనందాన్ని కల్గించింది. హాస్పిటల్‌కు కూతురు వొచ్చి పలుకరించలేదని బాధపడలేదు. నెలరోజుల్లో మామూలు మనిషి అయ్యాడు.

అమెరికానుంచి ఫోన్‌కోసం ఎదురుచూడటం మానేశాడు. ఫేస్‌బుక్‌లోని ఫ్రెండ్స్ 'అవసర సమయాల్లో పక్కన వుండి సహాయపడలేరు' అని తెలుసు కున్నాడు. ఒక్క క్షణం మంగారావును ఒదిలి వుండటంలేదు. రక్తసంబంధం కన్నా స్నేహబంధం గొప్పదని తెలుసుకున్నాడు.

- జాగృతి 12 నవంబరు 2012

(కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ)